బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

రఘునాథపల్లి: నర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

రఘునాథపల్లి, అక్టోబర్ 17: మండలంలోని రామన్నగూడెంలో టీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ రావుల తిరుమల్‌రెడ్డి నానమ్మ నర్సమ్మ (75) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట దేవరుప్పుల బీఆర్ఎస్ మండల నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, కోతి ప్రవీణ్, ఖానీం, గ్రామస్తులు ఉన్నారు.

కోలుకొండలో..

దేవరుప్పుల: కోలుకొండకు చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు, కొడకండ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోనగిరి యాకస్వామి తండ్రి చంద్రయ్య(70) అనారోగంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దయాకర్‌రావు చంద్రయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల నాయకులు బస్వ మల్లేశ్, కొల్లూరు సోమయ్య, ఏల సుందర్, చింత రవి, వంగ అర్జున్, మల్లికార్జున్, మాచర్ల బాబు, కుతాటి నర్సింహులు, మల్లారెడ్డి, తాటిపల్లి మహేశ్, కాడబోయిన యాదగిరి, ఇంద్రస్వామి, ఆలకుంట్ల యాదగిరి, ఎల్లయ్య, రాజన్న, నలుగురి పరశురాం ఉన్నారు.

మాజీ జడ్పీటీసీకి పరామర్శ

కొడకండ్ల: మండలంలోని రేగుల గ్రామానికి చెందిన, మాజీ జడ్పీటీసీ కేలోత్ సత్తెమ్మ హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతుండగా గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం

ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి గ్రామాల నాయకుల కృతజ్ఞతలు

బచ్చన్నపేట, అక్టోబర్ 17: మండలంలోని కట్కూర్– బండనాగారం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయించిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బండనాగారం, కట్కూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు బావండ్ల కృష్ణంరాజు, గ్రామ మాజీ సర్పంచ్ ముశిని సునీతా రాజు గౌడ్, శివరాత్రి కవితా రాజనర్సులు గురువారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఎమ్మెల్యే పంపించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఎన్నో ఏళ్లుగా మట్టి రోడ్డుతో అవస్థలు పడుతున్నామని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాపెల్లి జనార్దన్, కొప్పురపు రాజేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, చల్లా సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

అధికారుల సమావేశంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, అక్టోబర్ 17 : జిల్లాలో శుక్రవారం (నేడు) నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1,25,925 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా, 1,00,740.55 టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగినట్లుగా కొనుగోలు ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని 10 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521కి పత్తిని కొనుగోలు చేస్తుందన్నారు. తేమ 8 శాతం ఉండే విధంగా రైతులు చూసుకోవాలని, ఆపై తేమ శాతం పత్తిలో పెరిగిన కొద్ది, ఒక్కో శాతానికి మద్దతు ధర తగ్గుతూ వస్తుందన్నారు. అదేవిధంగా ఈసారి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా పత్తి రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబర్ 88972 81111ను రైతులు తమ సెల్ ఫోన్లలో సేవ్ చేసుకోవాలని, ఈ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ రైతులు మెస్సేజ్ పంపిస్తే, పత్తి అమ్మకం, అర్హత, తక్‌పట్టి వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్‌లో వేచి ఉండే సమయం వంటి పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సీసీఐకి పత్తి అమ్మే రైతులు ఆధార్ కార్డు ప్రామాణికత తప్పనిసరి, కొనుగోలు చెల్లింపులను ఆధార్‌తో అనుసంధానమై బ్యాంకు ఖాతాలో మాత్రమే జమ చేస్తారన్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో తనిఖీలు చేయాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపకశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, కుర్చీలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని, ముఖ్యంగా రైతులకు టోకెన్ సిస్టం అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, వ్యవసాయశాఖ అధికారి రామారావు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, రవాణాశాఖ అధికారి ఖలీల్, అగ్నిమాపకశాఖ అధికారి శ్రీరాములు, సీసీఐ అధికారులు నర్సిరెడ్డి, తిరుపతిరెడ్డి, ఏఎంసీ సెక్రటరీలు, జిన్నింగ్ మిల్స్ యజమానులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అధికారులు

వాల్మీకిని స్ఫూర్తిగా తీసుకోవాలి

మహర్షి వాల్మీకిని స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ ప్రధాన మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా, విశిష్ట అతిథిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాయణం రచించిన గొప్ప ఆది కవి వాల్మీకి అని కొనియాడారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్, కలెక్టరేట్ ఏవో ఏకే మన్సూరి, వాల్మీకి బోయ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు రాజు, యాదగిరి, రాజు, భూపతి, వెంకటేశం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలి

భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి జిల్లాలో స్వీకరించిన ఎల్ఆర్ఎస్, ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి ఎల్ఆర్ఎస్, ధరణి, రేషన్‌షాప్‌ల పనితీరుపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మండలాల యాక్షన్‌ప్లాన్ ప్రకారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని పేర్కొన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్‌శాఖ అధికారులతో కూడిన బృందం సమన్వయంతో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని రేషన్‌షాప్‌లను ప్రతినెలా మొదటి వారంలో తహసీల్దార్లు తనిఖీ చేయాలని, చివరి వారంలో 'సివిల్ రైట్స్ డే' తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై స్థానిక పోలీసు అధికారులతో కలిసి తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, దీనికోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నందున అవకతవకలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కొమురయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జనగామ జడ్పీ సీఈవోగా మాధురి షా

కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న జడ్పీ సీఈవో మాధురి షా

జనగామ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (జడ్పీ సీఈవో)గా గురువారం మాధురి షా బాధ్యతలు స్వీకరించారు. గుజరాత్ సెక్రటేరియట్ సర్వీస్ 2018 బ్యాచ్‌కు చెందిన మాధురి షా, డిప్యూటేషన్‌పై జిల్లాకు బదిలీపై వచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి



దేవరుప్పుల: రామరాజుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 17: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మల్లంపల్లి, అయ్యంగారిపల్లి, తొర్రూరులో ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రైతుల రుణ మాఫీ చేశారన్నారు. క్వింటా ధాన్యానికి రూ. 2300 మద్దతు ధర, సన్నరకం ధాన్యానికి బోనస్ రూ.500 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలుంటే రైతులు నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం పాలకుర్తిలోని బస్టాండ్, రాజీవ్ చౌరస్తాలో దుకాణాల సముదాయాన్ని పరిశీలించారు. పాలకుర్తి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, బస్టాండ్‌కు త్వరలోనే సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రుణమాఫీ అందరికీ వర్తించేలా చేయాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ అశోక్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. బ్యాంకులో 2,614మంది రైతులు రుణం పొందారని, అందులో 1,670 మందికి మాత్రమే రుణ మాఫీ అయిందన్నారు. ఇంకా 944 మందికి రుణమాఫీ కాలేదని, వారికి కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, ఆర్డీవో డీఎస్ వెంకన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాలకు ధాన్యం తరలించాలి

దేవరుప్పుల: రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామరాజుపల్లిలో ఐకేపీ నేతృత్వంలో శుభోదయ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మండలంలో 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులు సమీప కేంద్రాలకు తరలిస్తే వెంటనే తూకం వేసి రెండు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు వేస్తారన్నారు. డీఆర్డీవో వసంత, ఆర్డీవో కొమురయ్య, డీఏవో రామారావునాయక్, అడిషనల్ డీఆర్ఏడీవో శ్రీనివాస్, డీపీఎం రాజేంద్రప్రసాద్, చందన మండల సమాఖ్య అధ్యక్షురాలు ఉమ, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, నాయకులు ఉన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సమస్యలపై ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగోని సుమగౌడ్ ఎమ్మెల్యేకు వినతిప్రతం అందజేశారు. రామరాజుపల్లి, నీర్మాల గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు జిల్లా కేంద్రానికి వెళ్తారని, అదే సమయానికి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం బస్సు సమయాన్ని మార్చి విద్యార్థుల సమయానికి అనుకూలంగా నడపాలన్నారు. రామరాజుపల్లి పాఠశాలలో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, నిధులున్నా పనులు జరగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్

కొడకండ్ల: రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500బోనస్ ప్రకటించిందని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. గురువారం నర్సింగాపురం రిజర్వాయర్‌లో చేప పిల్లలను ఎమ్మెల్యే వదిలారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాజరాజేశ్వరదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు మొగుళ్ల చెరువు వద్ద 25 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీవో, తహసీల్దార్ చంద్రమోహన్, రాపాక సత్యనారాయణ, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనగామలో ముగిసిన దుర్గామాత ఉత్సవాలు

జనగామ, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట శ్రీవిజయ దుర్గామాత ఉత్సవాలు గురువారం ప్రత్యేక పూజల అనంతరం కుటుంబాలు సామూహిక వనభోజనాలకు వెళ్లడంతో నాలుగు రోజుల వేడుకలు ముగిశాయి. తొలి మూడురోజులు కనులపండువగా జరిగిన వేడుకల్లో తొలుత ఎల్లమ్మ కల్యాణం, బోనాలు, దుర్గమ్మ కల్యాణం, పొట్టేళ్ల రథంపై అమ్మవారి శోభాయాత్ర, పుట్టబంగారం (మట్టి)తో గద్దెల నిర్మాణం చేసి ఆలయ ప్రాంగణంలో పట్టం వేసి దుర్గా కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. చివరి రోజు అమ్మవార్లకు కోళ్లు, మేకలు, పొట్టేళ్లను మొక్కులుగా సమర్పించి బంధుగణంతో కలిసి సామూహిక విందు జరిపారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు

దేవరుప్పుల, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అంబాల శ్రీధర్, వెంకటేశ్, భాగ్యలక్ష్మి, సర్వేయర్ అరుణ, జ్యోతి, రికార్డు అసిస్టెంట్ మహేందర్, రాజు, మంజుల, అటెండర్లు యాకన్న, అక్బర్, చంద్రయ్య, ధరణి, ఆపరేటర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఆదికవి వాల్మీకి మహర్షి

పాలకుర్తి: మహాపుణ్య కవి, రామాయణం అందించిన వాల్మీకి మహర్షి కారణజన్ముడని పలువురు వక్తలు కొనియాడారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం మండలంలోని వల్మిడి సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాగత తోరణం వద్ద వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ ఓంప్రకాశ్, మోకాటి కుమార్, నీరటి చంద్రయ్య, ప్రభాకర్, తాళ్ల సోమనారాయణ, గజ్జి శ్రీను, వీరమళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకుర్తి: వల్మిడి ఆలయంలో పూజలుచేస్తున్న స్థానికులు

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి

నర్మెట, అక్టోబర్ 17: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని డీసీసీబీ డైరెక్టర్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు కన్నెబోయినగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఏగ్రేడ్ ధర రూ. 2,320, కామన్ గ్రేడ్ ధర రూ.2300 ఉన్నదని, సన్న రకాలకు రూ.500 బోనస్ ఇస్తున్నదన్నారు. కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, రైతు సంఘం మండల అధ్యక్షుడు చెవుల పర్షరాములు, చేర్యాల మార్కెట్ డైరెక్టర్ లక్ష్మి, పీఏసీఎస్ సీఈవో వెంకటయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కన్నీటి సమయంలో పాలివారి పంచాయితీ..

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 17: వ్యక్తి మృతి చెందగా, కర్మకాండ అనంతరం స్నానాలు చేసే సమయంలో పాలివారి పంచాయితీ జరిగిన ఘటన మండలంలోని ఇప్పగూడంలో చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోటకూరి హన్మంతు (75) అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం దశదినకర్మ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మృతుడి తమ్ముని (పాలివారు) దంపతులు అయిన తోటకూరి ఎల్లయ్య, ఉపేంద్ర స్నానం చేయడానికి రాగా, 'మీరు ఇక్కడ మాతో కలిసి స్నానం చేయడానికి వీలు లేదంటూ' కొందరు అవమానించారని బాధితులు మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పగూడంలోని ఉత్తర పట్టే యాదవులు, దక్షిణ పట్టే యాదవులు అంటూ రెండు గ్రూపులు ఉంటాయి. వీరి మధ్య రెండు సంవత్సరాల క్రితం గొడవ జరిగింది. అప్పటి నుంచి నేటి వరకు ఎల్లయ్య దంపతులు ఎలాంటి సంబంధాలు లేకపోయినా అన్న మృతి చెందాడనే బాధతో కార్యక్రమాలకు హాజరయ్యారు. దశదినకర్మ రోజున తోటకూరి ఎల్లయ్య సొంత తమ్ముడితో పాటు పాలివారు దుర్భాషలాడి స్నానం చేయకుండా చేయడంతో ఆ దంపతులు కలత చెంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. తమపై దుర్భాషలాడి, కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజరాజేశ్వరీ దేవికి వినయ్‌భాస్కర్ పూజలు

కొడకండ్ల, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయాన్ని గురువారం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ధ్యానంలో కూర్చున్నారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న వినయ్‌భాస్కర్

జఫర్‌గఢ్ మండల ఏవోగా కర్ణాకర్‌రెడ్డి

ఏవో కర్ణాకర్‌రెడ్డి

జఫర్‌గఢ్, అక్టోబర్ 17: మండల వ్యవసాయ అధికారిగా ఏ కర్ణాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2023లో తెలంగాణ స్టేట్ పబ్లిక్‌సర్వీస్ కమిషన్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన ఈయన 2024 లో ఏవోగా ఉద్యోగం సాధించాడు. ఇటీవల జిల్లా స్థాయి కౌన్సెలింగ్‌లో జఫర్‌ఘడ్ మండలం కేటాయించగా బాధ్యతలు చేపట్టారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

తరిగొప్పుల, అక్టోబర్17: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అయ్యాల శ్వేత గురువారం తెలిపారు. మండలంలోని అబ్దుల్‌నాగారంలో పోలీస్ సిబ్బంది ప్రదీప్, శ్రీనివాస్, గలీబ్, బాలాజీ ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా లింగంపల్లి నుంచి అక్రమంగా అబ్దుల్‌నాగారం వైపు వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానులు లింగంపల్లికి చెందిన మోతో శ్రీనివాస్, తరిగొప్పుల మండల కేంద్రనికి చెందిన మేడల రాజు, డ్రైవర్లు మాలోత్ సందీప్, విష్ణువర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దర్గయ్య(ఫైల్)

జఫర్‌గఢ్, అక్టోబర్ 17: మండలంలోని శాపల్లికి చెందిన ఉప్పునూతుల దర్గయ్య (42) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. దర్గయ్య బుధవారం తన భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయాన్ని దర్గయ్య ఫోన్‌లో గ్రామస్తులకు తెలుపడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స కోసం హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ దర్గయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అభిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖిలాషాపూర్ పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ

క్రీడా సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రఘునాథపల్లి, అక్టోబర్ 17: మండలంలోని ఖిలాషాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి పూర్తి చేసిన 2003–04 బ్యాచ్ విద్యార్థి బృందం రూ.16వేల విలువైన క్రీడా సామగ్రిని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ భారత రవీందర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న పూర్వ విద్యార్థులను హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుప్పాల వేణు, డీ రాజశేకర్, బండి శంకర్, జక్కుల శివ, యాకూబ్ పాషా, బీ జంపన్న, గాదె సంజీవ, ఫిజికల్ డైరెక్టర్ సోమన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింగరావు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం షారోన్, ఉపాధ్యాయులు

'రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్'కు తిమ్మంపేట విద్యార్థులు

జఫర్‌గఢ్, అక్టోబర్ 17: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం దామెర షారోన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు బుల్లెస్పందన, పెండ్లి నిఖిత, లకావత్ దీపికా, మాచర్ల రిషిత, భూక్యా రాణిని ఉపాధ్యాయులు, హెచ్ఎం షారోన్ అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు.

పనిచేయని నిఘానేత్రాలు

- మండలంలోని గ్రామాల్లో నిరుపయోగంగా సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు

జనగామ రూరల్, అక్టోబర్ 17: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. వాటికి మరమ్మతులు చేయించాలనే ఆలోచన అధికారులకు లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. సిద్దెంకి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని ఏండ్ల నుంచి నిరుపయోగంగా ఉన్నాయని, గ్రామాల్లోని సీసీ కెమెరాల పరిస్థితి కూడా అలాగే ఉందని వాపోతున్నారు. నిఘా నేత్రాలతో నేరస్తులను త్వరగా పట్టు